కొత్త పింఛన్ల జాడేది?



పాన్‌గల్ పోస్టాఫీస్‌లో పింఛన్ కోసం లబ్ధిదారుల ఫొటో తీస్తున్న అధికారి(ఫైల్)

- ఆసరా పింఛన్ల కోసం అర్హుల ఎదురుచూపులు
- హామీలు అమలు చేయాలంటున్న లబ్ధిదారులు

పాన్‌గల్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పథకం కింద కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని, ప్రస్తుతం ఉన్న వాటికి మరో రూ.2వేలు పెంచుతామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా.. ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు 58 ఏళ్లు నిండిన అర్హులు ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చి నెలలు గడుస్తున్నా, కొత్త పింఛన్ల ఊసేలేదని ఆందోళన చెందుతున్నారు. పాతవి పెంచుతారని, కొత్తవి మంజూరు చేస్తారని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఇటీవల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాయాల ముందు ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఇబ్బందులను తొలగించాలని ఆసరా లబ్ధిదారులు కోరుతున్నారు.

మండలాల వారీగా వివరాలు		
మండలం	ప్రస్తుతం పింఛన్లు	కొత్త దరఖాస్తులు
పాన్‌గల్	6288	275
చిన్నంబావి	3790	160
వీపనగండ్ల	3608	200

మండల పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 6,288 ఆసరా పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజాపాలనలో సుమారు మండలంలో 300 వరకు దరఖాస్తులు చేసుకున్నారు. 58 ఏళ్లు నిండిన వారి దరఖాస్తులు తీసుకొని నెలలు గడుస్తున్నా నేటికీ మంజూరు కాలేదు. ప్రస్తుతానికి భర్తల పేరున పింఛన్ ఉండి ఆయన మరణిస్తే భార్యకు మంజూరు చేస్తున్నారు. కానీ కొత్తగా దరఖాస్తులు చేసుకున్న ఎవరికీ ఇప్పటి వరకు మంజూరు కావడంలేదు. దీంతో అర్హులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్తవి మంజూరు చేసి పాతవి పెంచాలని కోరుతున్నారు.

పింఛను మంజూరు కాలేదు



నాకు 74ఏళ్ల వయస్సు ఉంది. వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేశాను. ఇప్పటికీ నాల్గుసార్లు దరఖాస్తులు చేసినా నెలలు గడుస్తున్నా నూతన పింఛన్ మంజూరు కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంజూరు చేయాలి.

– దేవమ్మ, తెల్లరాళ్లపల్లితండా

హామీలు అమలు చేయాలి



ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్లు పెంచాలి. అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లు మంజూరు చేయాలి. చాలా మంది అర్హత ఉన్న వారు దరఖాస్తులు చేసుకొని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అర్హులైన వారికి నూతన పింఛన్లు లబ్ధిదారుల ఇబ్బందులు తొలగించాలి.

– కళావతమ్మ, కేతేపల్లి

వివరాలు ప్రభుత్వానికి నివేదించాం



మండలంలో వివిధ గ్రామాల నుంచి నూతన పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం పింఛన్ల పెంపు, నూతన పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కుటుంబంలో భార్య చనిపోతే వారికి సంబంధించిన పింఛన్ భర్తకు చేస్తున్నాం.

– గోవింద్‌రావు, ఎంపీడీఓ, పాన్‌గల్

క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆత్మకూర్: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో 'పోషన్ భీ, పడ్‌నా భీ' కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. మూడు రోజుల పాటు శిక్షణలు కొనసాగుతాయని గర్భిణీ, బాలింతలు, చిన్నారుల పోషణ స్థాయి తదితర విషయాలపై క్లుప్తంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భారతి, శ్రీలత, నర్మద, పోషన్ అభియాన్ శిక్షకులు మునిస్వామి, నాగరాజు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వర్ధంతి



కొత్తకోట రూరల్: వనపర్తి మాజీ ఎమ్మెల్యే పాగాకు అయ్యప్ప 14వ వర్ధంతి మంగళవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులతో పాటు అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ పి.విశ్వేశ్వర్, డాక్టర్ పీజే బాబు, బోయేజ్, న్యాయవాది రాములుయాదవ్, సత్యంయాదవ్, బాబురెడ్డి, కె.శ్రీనివాస్‌జీ, కృష్ణయ్యగౌడ్, వెంకటన్నగౌడ్, ప్రేమదానం, సుభాష్, బాలకృష్ణారెడ్డి, శంకర్‌యాదవ్, గంగాధర్‌శెట్టి, రాజశేఖర్, హోటర్ కురుమూర్తి, శ్రీనివాస్‌గౌడ్, నగేష్‌రెడ్డి ఉన్నారు.

లక్ష విగ్రహాల ప్రదర్శన వాల్‌పోస్టర్ విడుదల




వనపర్తిటౌన్: అక్టోబర్ 10,11,12,13వ, తేదీల్లో ఎల్‌బీ స్టేడియంలో గాంధీ లక్ష విగ్రహాల ప్రదర్శన ఉంటుందని గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె. వీరయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం లక్ష విగ్రహాల ప్రదర్శన వాల్‌పోస్టర్ డీఐఈఓ కార్యాలయంలో డీఐఈఓ ఎర్ర అంజయ్య విడుదల చేశారు. కార్యక్రమంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

హైమస్ట్ లైట్ల ఏర్పాటు



అమరచింత: పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో రెండు నెలల నుంచి వెలగని హై మస్ట్ లైట్లను మంగళవారం తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజ్ తెలిపారు. రెండు నెలల కిందట హైమస్ట్ లైట్లు కాలిపోయినట్లు తెలిపారు. ఆరు లైట్లకు ఒక్క లైట్ మాత్రమే వెలుగుతుండేదని, దీంతో చౌరస్తాలో అంధకారం సమస్య తలెత్తిందన్నారు. కొత్తగా 6 లైట్లను తెప్పించి తమ సిబ్బంది ద్వారా ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది అల్లిపాషా, హరికృష్ణ, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణంలో మంజూరైన 150 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో దాదాపు 100 ఇళ్ల పనులు కొనసాగుతున్నాయని, మిగతా 50మంది లబ్ధిదారులను సైతం ఇళ్లు కట్టుకోవాలని అవగాహన కల్పిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు ఎన్‌జే.బోయేజ్, డాక్టర్ పీజే.బాబు, వేముల శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు అన్నారు.

ఆలయంలో ఆరుద్ర పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో గల శ్రీదత్తకోటి లింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ఏకదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు శేఖరయ్య తెలిపారు. పరమశివుడి జన్మనక్షత్రమైనటువంటి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో శివలింగానికి అర్చకులు పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

గణేశ్ ఉత్సవ నిర్వాహకులకు సన్మానం



గణేశ్ ఉత్సవాలు నిర్వహించిన కవులు, కళాకారులను సన్మానిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: జిల్లాలోని గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మండప నిర్వాహకులు, కవులు కళాకారులు వివిధ కళాకారులతో అభినందన కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ మంగళవారం నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా నిర్వహించినందుకు సహకరించిన గణేశ్ మండపాల నిర్వాహకులు, డీజే యజమానులు, జానపద కళాకారులు, చెక్కభజన మండలి, సాంస్కృతిక కళా మండలి, భజన మండలి వివిధ కళాకారులను ఎస్పీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన సంస్కృతి సంస్కారాలు మరుగున పడిపోయాయని, మార్పు రావాలనే ఆలోచనతో వనపర్తి జిల్లా ముందడుగు వేయాలని, డీజేలు, బాణాసంచా నిషేధించినట్లు తెలిపారు. గణేశ్ ఉత్సవాలు శోభాయాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించాలని జిల్లాలోని గణేశ్ మండపాల నిర్వాహకులు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆత్మకూరు సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్ఐ జలేందర్‌రెడ్డి, కవులు, కళాకారులు, మీసాల రాములు, సవారయ్య, పాండురంగయ్య, ఉందేకోటి కృష్ణ, గంధం నాగరాజు, శ్యామల, ప్రసన్న రాణి, శ్రీదేవి, నాగరాజు గౌడ్, నరసింహ, బండారి కురుమన్న, మమత, రాధ, విజయ్, డప్పు నాగరాజు, డప్పు స్వామి, డాన్స్ మాస్టర్, తరుణ్, జిల్లాలోని గణేష్ మండపాల నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

కొత్తకోట: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా కొత్తకోట పట్టణంలోని కొత్తకోట ప్యూపిల్స్ స్కూల్ ఏరియాలో ఏర్పాటు చేసిన వినాయకుడికి తొమ్మిది రోజుల పాటు సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఆ కాలనీలో వినాయకుడిని నెలకొల్పిన గణేష్ మెడికల్ యజమాని ఎరుమలి నరసింహను స్వయంగా పిలిచి వారిని సన్మానించారు. దీంతో నరసింహ జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రిలో ప్రసవం సురక్షితం



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న మండల వైద్యాధికారి వంశీకృష్ణ

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాలలోని గర్భవతులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే సుఖ ప్రసవాలు జరిగేవిధంగా గ్రామీణ ప్రాంత మహిళలకు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆశా డే కార్యక్రమంలో పాల్గొని ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతుల పేర్లను వివరాలను ఆన్‌లైన్‌లో విధిగా నమోదు చేయాలని మారుమూల ప్రాంతాలలోని పల్లె దవాఖానలో అందుతున్న వైద్య వసతులు, ఎమర్జెన్సీ మందులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్‌లు హేమవర్ధన్, శ్వేత, కరుణశ్రీ, భాగ్యశ్రీ, కవిత, మౌనిక, జౌహన్, కేశవులు, వైద్య సిబ్బంది కళమ్మ, విజయకుమారి, జహంగీర్ పలువురు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేమద్దులలో మైనింగ్ అధికారుల పరిశీలన



మైనింగ్ ప్రాంతంలో వివరాలను సేకరిస్తున్న అధికారులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామ మైనింగ్ ప్రాంతాన్ని రైతుల ఫిర్యాదు మేరకు మంగళవారం రాయల్టీ, రెవెన్యూ అధికారులు సందర్శించారు. గ్రామంలోని సర్వేనెంబర్ 230, 232, 233, 234, 235, 251, 252 తదితర సర్వే నంబర్లలో ఉన్న 12.16 ఎకరాలు మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం 2005లో అనుమతి ఇచ్చింది. వాల్యానాయక్‌తండాకు చెందిన రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అనుమతి సర్వే నంబర్లలో కాకుండా 243, 245 సర్వే నంబర్లలో కొంత వరకు తవ్వకాలు చేపడితే 2016లో యజమాన్యానికి పెనాల్టీ వేశారని, ప్రభుత్వానికి పెనాల్టీ చెల్లించి మళ్లీ అనుమతి పొందారన్నారు. సర్వే నంబర్లు 243, 245లో ఉన్న గొల్లకుంటను ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఫిర్యాదు చేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అనుమతి సర్వే నంబర్లలోనే తవ్వకాలు చేస్తున్నామని, గ్రామానికి చెందిన కొందరూ కావాలని తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, ఇందులో అధికారులు సర్వే నిర్వహించి నిజాలు తెలుస్తారని యజమాన్యం పేర్కొన్నారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించామని, మండల సర్వేయర్ రాకపోవడంతో సర్వే చేయలేదని అధికారులు పేర్కొ న్నారు. మరోసారి తేదీ ప్రకటించి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సురేఖ, మైనింగ్ సర్వేయర్ సుజాత, ఆర్ఐ మహేష్, జీపీఓ బాబు, వీఆర్ఏ మల్లేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: జిల్లా, మండల స్థాయి ఉత్తమ అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు బొరెల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఏఐఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల్ కృష్ణ మాట్లాడారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు డి. అనిత, బొరెల్లి అంజనమ్మ, చిన్నస్వామి, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు నవనీత, అశ్విని, జీజేసీలో ఇంగ్లిష్ జూనియర్ లెక్చరర్‌గా నియమితుడైన రమేష్, బయోసైన్స్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన రాధాకృష్ణలను సన్మానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేశవులు, టి.శివన్, కొప్పునూరు వెంకటస్వామి, ఎం. సురేష్, పరమేశ్వర్, మన్నెం, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల, మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు డి.రణదీప్, పి.వెంకటస్వామిలు మండల, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్.వరప్రసాదరావు మాట్లాడారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

పోటీ పరీక్షల్లో రాణించాలి



వనపర్తిటౌన్: గ్రంథాలయాలను నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా గ్రంథాలయంలో బండారు శ్రీనివాస్ బుద్ధ భూమి మాసపత్రిక సంవత్సరాది చందా చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని నిరుద్యోగులు పోటీ పరీక్షల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. గ్రంథాలయం ఆధునీకరించినట్లు తెలిపారు. డిజిటల్ లైబ్రరీ, పిల్లలు, పెద్దలు, అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్, లైబ్రేరియన్ శ్రీనివాస్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల ముందస్తు అరెస్టులు సరికాదు

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణ పోలీసులు అత్యుత్సాహం వల్ల కార్మికులు, వారి కుటుంబాలు ఆందోళన చెందాయని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షు లు శ్రీరామ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో కలిసి మాట్లాడారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో విధుల్లో ఉన్న ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్ యూనియన్ బ్రాంచ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు నరసింహ, రాజేష్‌కుమార్ బాలకృష్ణ, శ్రీకాంత్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకోని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడం ఎంత వరకు సమంజసమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్ దినోత్సవం



కొత్తకోట రూరల్: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ పెద్దమండడిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'ఓజోన్ పొరను కా పాడుదాం–భూమిని రక్షించుదాం' అనే నినాదా లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని ఉపాధ్యాయులు విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నినాదాలు వినిపించాయి. హెచ్ఎం శాంతన్న, ఉపాధ్యాయులు సాయిచందర్ రెడ్డి, బాలాజీ, సుదర్శన్ గూడ్, భద్రు, సంజీవ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

పాన్‌గల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూ రంగా ఉండవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపేట లో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. జ్వర పీడిత వ్యక్తుల వివరాలు సేకరించి రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్ పాల్గొన్నారు.

మంజూరైన నిధుల యూసీలు సమర్పించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: గతేడాది వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, భవనాల మరమ్మతు కోసం మంజూరైన ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల వినియోగానికి సంబంధించి వేగంగా యూసీలు సమర్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల వినియోగానికి సంబంధించిన అంశంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, భవనాల మరమ్మతు కోసం మంజూరైన నిధుల వినియోగానికి సంబంధించి వేగంగా యూసీలు సమర్పించాలని ఆదేశించారు. పనులు పూర్తిచేసి యూసీలు సమర్పించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. కొత్త మరమ్మతు పనులకు సంబంధించి ప్రతిపాదనలు ఫొటోతో సహా పంపించాలని తెలిపారు. అధికారులు తమ పరిధిలోని మరమ్మతు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు డీ సెక్షన్ ద్వారా ఎంత త్వరగా ఇస్తే అంత త్వరగా పనులు మంజూరవుతాయని తెలిపారు. ఈ వారంలోగా ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు పంపించే ప్రతిపాదనలకు సంబంధించి రిపేర్ వర్క్స్ యొక్క ఫొటోలు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మధు, డీ సెక్షన్ సూపరింటెండ్ మదన్, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు ఉన్నారు.

యూరియా సమస్యకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత



గోపాల్‌పేటలో తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

గోపాల్‌పేట: రాష్ట్రంలోని రైతులకు తగిన సమయంలో అనుకున్నమేరకు యూరియా ఇచ్చిఉంటే రైతులు ఇంత ఇబ్బందులకు ఎదురయ్యే వారు కాదని, కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందేనని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో యూరియా సరఫరాలో పాలకుల వైఫల్యాన్ని నిరసిస్తూ గోపాల్‌పేట మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రం అందించారు. పాన్‌గల్ మండలంలో 6న చిట్టీలు రాయించుకుంటే 15న యూరియా అందించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని అన్నారు.

రైతాంగ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తర్వాత వచ్చిన అనేక ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి అని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. ఈనెల 1నుంచి 17 వరకు జిల్లాలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని ఏదుట్ల, గోపాల్‌పేట మండల కేంద్రంలో జెండాలను ఆవిష్కరించారు. పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రయ్య, రమేష్, జయమ్మ, శాంతయ్య, కురుమూర్తి పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని కొంకన్వానిపల్లె లో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సీపీఐ నాయకులు గ్రామస్తులతో కలిసి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం మాట్లాడారు. కార్యక్రమంలో కుతుబ్, అంజి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మూడు రోజులు వనపర్తిలో సెపక్‌తక్రా పోటీలు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

వనపర్తిటౌన్: ఈనెల 20 నుంచి 22వ, తేదీ వరకు (మూడు రోజుల పాటు) 11వ, సీనియర్ ఇంటర్ డిస్టిక్ సెపక్‌తక్రా చాపియన్‌షిప్ పోటీలు జిల్లా కేంద్రంలో ఉంటాయని జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరిగిన సెలక్షన్స్‌కు ఆయన హాజరైన పరిశీలించారు. జిల్లా కేంద్రంలో జరిగే సెపక్‌తక్రా పోటీలను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డిలు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సురేందర్, రిటైర్డ్ పీడీ భాస్కర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు యాపర్ల రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న గోపాల్‌పేట విద్యార్థులు



పాన్‌గల్‌లో ఎస్‌జీఎఫ్ పోటీల ప్రారంభోత్సవంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, జీహెచ్ఎంలు

గోపాల్‌పేట: క్రీడలతోనే మానసికోల్లాసం, చదువుపై మక్కువ పెరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు రంగస్వామి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్–14, అండర్–17 విద్యార్థులకు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారు. కబడ్డీ అండర్–17లో గోపాల్‌పేట ఫస్ట్‌ప్లేస్ సాధించగా, ఏదుట్ల రెండోస్థానం సాధించింది. ఖోఖోలో గోపాల్‌పేట మొదటి స్థానం ఏదుట్ల రెండోస్థానం సాధించాయి. వాలీబాల్‌లో గోపాల్‌పేట జూనియర్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఫిజికల్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయులు క్రీడల నిర్వహణను పరిశీలించారు.

ఆత్మకూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయస్థాయిలో సత్తా చాటాలని ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, ఎంపీడీఓ శ్రీపాద్, ఎంఈఓ కొండాపురం బాలరాజు, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ సెలక్షన్‌లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాన్‌గల్: విద్యార్థులకు క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికలు, బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ఎంఈఓ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపు, ఓటములను విద్యార్థులు సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల జీహెచ్ఎంలు విజయలక్ష్మి, నాగలీల, పీడీలు శ్యామల, అనిల్‌కుమార్, గోవింద్, పద్మ, శ్రీదేవి, పీఈటీలు ఉమామహేశ్వర్‌రెడ్డి, లక్ష్మి, మోహన్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోను రాణించాలని మండల విద్యాధికారి జయశంకర్, అన్నదాత, సీనియర్ జిల్లా నాయకులు సాయిచరణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ సెలక్షన్లు, టోర్నీ నిర్వహించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, పీఈటీలు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనకు పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న సేవాలాల్‌సేన అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు

గోపాల్‌పేట: సామాజిక న్యాయం రాజ్యాధికార సాధనే లక్ష్యంగా దశాబ్ద కాలంగా లంబాడి, బంజారాల మనుగడ సాధన కోసం పోరాడుతున్న సంఘం సేవాలాల్ సేన అని సేవాలాల్ సేన స్టేట్ ప్రెసిడెంట్ ఆంగోత్ రాంబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో సేవాలాల్ సేన వనపర్తి జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగోత్ రాంబాబు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా లంబాడ, బంజారా మనుగడ సాధనకోసం సేవాలాల్‌సేన పోరాడుతోందన్నారు. సంత్‌శ్రీ తపస్వి రామారావు మహారాజ్ స్ఫూర్తితో బంజారాల అభివృద్ధికోసం పోరాడుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి రవినాయక్, రఘు రాం రాథోడ్, గోపాల్‌నాయక్, కిషన్‌నాయక్ ఉన్నారు.

కనులపండువగా సవారమ్మ ఉత్సవాలు



ఉప్పరిపల్లిలో దేవాలయం దగ్గర భక్తుల సందడి



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో సవారమ్మ, సరస్వతమ్మ, మారెమ్మ, కర్రెమ్మ దేవతల ఉత్సవాలు మంగళవారం కనుల పండువ గా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఉద యం నుంచి దేవాలయం దగ్గర అమ్మవార్లకు ప్రత్యే క పూజలు నిర్వహించారు. కొందరు కోడిపుంజులు, గొర్రెపొట్టేళ్లను కోసి మొక్కులు తీర్చుకున్నారు. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపును గ్రామంలోని బొడ్రాయి మీదుగా ఊరేగింపు నిర్వహించి దేవాలయం దగ్గరకు చేరి ప్రదక్షణలు చేశారు. గ్రామంలో పండగ సందర్భంగా ఆడపడుచులు, బంధువులు పెద్ద సంఖ్యలో గ్రామానికి రావడంతో సందడి నెలకొంది.